క్లుప్తంగా

పార్లమెంట్ భవనాల తపాలా బిళ్ల సేకరణ



పార్లమెంట్ భవనాల తపాలా బిళ్ల సేకరణ

అమలాపురం టౌన్: పార్లమెంట్ పాత, కొత్త భవనాల చిత్రాలు, రూ.75 ముఖ విలువతో భారత తపాలా శాఖ ఇటీవల విడుదల చేసిన తపాల బిళ్లను అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు. ఈ తపాలా బిళ్లపై పాత పార్లమెంట్ భవనంతో పాటు నూతన పార్లమెంట్ కాంప్లెక్స్‌ను ముద్రించారు.

ఆవుకు అత్యవసర చికిత్స

అమలాపురం టౌన్: విషపూరిత ఆహారం తిని ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న వీధి ఆవుకు అత్యవసర వైద్యం అందించారు. స్థానిక సబ్ జైలు వెనుక భాగంలో ఓ ఆవు పడుతున్న అవస్థను చూసి అఖిలేష్ అనే రైతు అందించిన సమాచారం మేరకు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి తన బృందంతో అక్కడకు చేరుకుని అత్యవసర చికిత్స చేశారు. చికిత్స అనంతరం ఆవు ఆరోగ్యం కుదటపడింది. స్థానిక గౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాల సేవకులు గొవ్వాల అచ్యుతరామయ్య, రైతులు కృష్ణ ప్రసాద్, వాకపల్లి చిన్న, మద్దిరెడ్డి చిన్న తదితరులు బాధిత ఆవుకు సేవలు చేశారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత

అల్లవరం: ఇటీవల ఇంటర్వ్యూల ద్వారా ఎంపికైన వలంటీర్లకు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు శనివారం నియామక పత్రాలను అందించారు. ఎస్.పల్లిపాలెం, అల్లవరం, బోడసకుర్రు, కొమరగిరిపట్నం సచివాలయాల పరిధిలో వలంటీర్లను ఎంపిక చేశామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. వారికి కేటాయించిన కుటుంబాలకు సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

రైతులకు ఎరువుల పంపిణీ


రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఉద్యాన సహాయకురాలు దునీషా

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్లలో కొబ్బరి చెట్ల పునరుద్ధరణ పథకంలో భాగంగా ఉద్యాన సహాయకురాలు దునీషా శనివారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాపు కాయలేని కొబ్బరి చెట్లు, తెగుళ్లు సోకిన చెట్లు, ముదురు చెట్లను ఒక హెక్టారుకు 32 వరకూ తొలగించడానికి రైతులు అర్హులన్నారు. తొలగించిన చెట్టుకు రూ.1,000 చొప్పున రైతులకు అందిస్తామని చెప్పారు. సదరు రైతులకు రెండేళ్ల పాటు రూ.8,000 విలువ చేసే ఎరువులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు నడింపల్లి సోమరాజు, పిన్నంరాజు చిరంజీవి వర్మ, పాత్తూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.


సిటిజన్ బ్యాంకు సిబ్బంది స్వచ్ఛభారత్

యానాం: యానాం పట్టణ ది సిటిజన్ కోపరేటివ్ బ్యాంకు సిబ్బంది శనివారం బ్యాంకు పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని రోడ్లు, డ్రైన్‌లను శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, సతీష్, వెంకటరమణ, శ్రీనివాస్, తులసి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యుడి పరామర్శ

ఉప్పలగుప్తం: మాతృ వియోగంతో బాధపడుతున్న భీమనపల్లి సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు కుటుంబీకులను జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ప్పలగుప్తం, మునిపల్లి సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు శనివారం పరామర్శించారు. మండలంలోని సూదాపాలేనికి చెందిన శిరంగు వెంకటలక్ష్మి ఇటీవల మృతిచెందడంతో ఆమె కుమారులు శిరంగు సత్తిరాజు, నాగకుమార్‌లను వారు శనివారం పరామర్శించి వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

పార్కులో విశ్రాంతి షెడ్డు నిర్మాణం


వాకర్స్ వితరణతో పార్కులో నిర్మించిన విశ్రాంతి షెడ్డు

అమలాపురం టౌన్: స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యాన వనం(పార్కు)లో వాకర్స్ వితరణతో రూ.1.50 వ్యయంతో విశ్రాంతి షెడ్డు నిర్మించారు. వాకింగ్ చేశాక పార్కులో కాసేపు సేద తీర్చుకునేలా ఈ షెడ్డును నిర్మించుకున్నారు. మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు షెడ్డుకు టైల్స్ సమకూర్చగా మిగిలిన దాతలు పెంకుల రూపంలో ఉండే రేకులు, సిమెంట్ బెంచీలు వంటివి సమకూర్చారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: పేదల సంపూర్ణ ఆరోగ్యమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం తానేల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. శిబిరంలో వైద్యులతో ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం సుమారు 557 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, సర్పంచ్ నక్కా విజయరాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, సూరిబాబు, జగతా పద్మనాభం, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పేదలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో భారతిలక్ష్మి అన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు డీఎంహెచ్‌వో భారతిలక్ష్మి, ఎంపీపీ భాగ్యలక్ష్మి తదితరులు

శనివారం పాలగుమ్మి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్ గోపాల్‌లతో కలిసి ఆమె ప్రారంభించారు. శిబిరంలో 550 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుడుపూడి రమాలక్ష్మి, కార్యదర్శి అనంతలక్ష్మి, ఎంపీటీసీ పాలగుమ్మి విజయ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి ఆరోగ్య రక్ష కలుగుతుందని ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు అన్నారు. శనివారం జి.వేమవరం పంచాయతీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, మండల పరిషత్ కార్యాలయ ఏఓ చింతా మోహనకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుధారాణి, నాయకులు దెయ్యాల సత్తిబాబు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని ఓడలరేవు ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ముఖ్య అతిథిగా హాజరై రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, వైస్ ఎంపీపీ ముత్యాల వెంకట రామకృష్ణ, అవనిగడ్డ శేషగిరిరావు, పెచ్చెట్టి బాబ్జి, చొల్లంగి రాధాకృష్ణ, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని ఐ.పోలవరం సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజుల ఆధ్వర్యంలో శిబిరంలో వైద్యులు 712 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.రాంబాబు, సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, వైద్యులు టి.ఆదిత్య పవన్, శివగాయిత్రి, ఎం.రామానుజరావు, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామపంచాయితీ సచివాలయం-2 పరిధిలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శిబిరానికి 360 మంది హాజరుకాగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, స్థానిక ఎంపీటీసీలు నాగులపల్లి శేషవేణి, దేశంశెట్టి రత్నకుమారి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోన సచివాలయం-4 వద్ద మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేలకిషోర్, పాలెపు ధర్మారావు, సంగాని మునేంద్ర, బొమ్మిడి సూరిబాబు, సంసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జి.వేమవరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు


ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

మాదిగల సంక్షేమానికి కృషి చేయాలి


కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం రూరల్: మాదిగల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ, శాసనసభ ఎస్సీ సంక్షేమ అభివృద్ధి కమిటీ సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్ కలెక్టర్ హిమాన్షు శుక్లాను కోరారు. కోనసీమ చర్మకారుల సంఘాల ప్రతినిధులు శనివారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి వెళ్లి కలెక్టర్‌కు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వృత్తిలో నైపుణ్యం పెంచుకునేలా స్టైఫండ్‌తో కూడిన శిక్షణనిచ్చి వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇవ్వాలని అడిగారు. ప్రతి గ్రామంలోనూ అర్హులైన చర్మకారులను గుర్తించి వారికి సర్టిఫికెట్‌తో సంబంధం లేకుండా పింఛన్ ఇవ్వాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ బ్యాంకు అధికారులతో చర్చించి చర్మకార వృత్తులవారికి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మొనగలేటి వీర్రాజు, వీధి శ్యాముల్, పిప్పర వెర్రియ్య, నేదునూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆలయాల హుండీల లెక్కింపు

యానాం: నియోజకవర్గ పరిధిలో కొలువైన ప్రధాన ఆలయాల్లో హుండీల్లో భక్తులు వేసిన కానుకల సొమ్మును ఎట్టకేలకు శనివారం లెక్కించారు. శ్రీభూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం, పిల్లారాయ దేవాలయం, పోలేరమ్మ ఆలయం, శివాలయంలలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా మొత్తంగా రూ.10,49,995 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. చాలా నెలల పాటు సొమ్మును లెక్కించకపోవడంతో హుండీలలో కరెన్సీ నోట్లు పాడైపోయాయని, అలాంటి నోట్ల విలువ సుమారు రూ.34 వేల వరకు ఉంటుందని భావిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు పులవర్తి శ్రీను, పడాల వెంకటేశ్వరరావు, మంచాల సాయి, చెక్కల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలునికి గుడ్‌సీడ్ ఆర్థిక వితరణ



మణికంఠ తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న రమణారావు

ఉప్పలగుప్తం: ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద కోలుకుంటున్న బాలునికి గుడ్‌సీడ్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు రూ.10 వేలు ఆర్థిక వితరణ చేశారు. మండలంలోని గొల్లవిల్లి గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు సలాది మణికంఠ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్నాడు. బాలుని తల్లిదండ్రులకు రమణారావు శనివారం చెక్కును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఉప సర్పంచ్ దొంగ దుర్గ, జొన్నాడ చిన్ని, గంటా లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల భవన నిర్మాణానికి కృషి


ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం తాలూకా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘ నూతన భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హామీ ఇచ్చారు. స్థానిక తాలూకా సంఘ భవనంలో శనివారం జరిగిన అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సంఘీయులు తమ శిథిల భవనాన్ని ఎమ్మెల్సీకి చూపించారు. అనంతరం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరించారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు పెమ్మాడి సాయిబాబు, గౌరవాధ్యక్షుడు కొల్లు బాబ్జి, కొల్లు వర్మ, చిప్పల సుబ్రహ్మణ్యం, పాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు కళ్లెం వేయాలి

- అక్రమ రవాణాను అరికట్టాలి
- ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ హిమాన్షు శుక్లా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా. చిత్రంలో ఎస్పీ శ్రీధర్ తదితరులు

అమలాపురం రూరల్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు కళ్లెం వేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా స్థాయి నార్కో కో ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను, మాదకద్రవ్యాలు, మందులు, ఇతర మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని నియంత్రించడం, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఈ వ్యసనానికి బానిస అయినవారిని గుర్తించి, చికిత్స, పునరావాసం కల్పించాలని, అప్పుడే దీనికి కళ్లెం పడుతుందని అన్నారు. జిల్లాలో గంజాయి వినియోగాన్ని అరికట్టడంలో పోలీసు శాఖ పనితీరును కలెక్టర్ ప్రశంసించారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని అన్నారు. జొన్నాడ, యానాం ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే వాహనాలపై ఎక్కువగా నిఘా పెట్టాలని పోలీసు, రవాణా అధికారులకు సూచించారు. జిల్లాలోని గురుకుల సంక్షేమ హాస్టళ్లలో రాత్రి వేళల్లో వార్డెన్లు ఉండటం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని, దీని వలన తల్లిదండ్రులకు దూరంగా ఉండే విద్యార్థులు డ్రగ్స్ అలవాటు చేసుకునే ప్రమాదం ఉంటుందని అన్నారు. సంక్షేమ అధికారులు జిల్లాలోని హాస్టళ్లను రాత్రి పూట సందర్శించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ అధికారులకు కలెక్టర్ శుక్లా సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ, గత సమావేశం నుంచి ఇప్పటి వరకూ 10 గంజాయి రవాణా, పెడ్లింగ్ కేసులు నమోదు చేశామని చెప్పారు. రూ.11.36 లక్షల విలువైన 376 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగంపై నష్టాలను వివరిస్తూ జూలై నెలలో యాంటీ డ్రగ్ క్యాంపెయిన్లు నిర్వహించామన్నారు. గంజాయి రవాణా, పెడ్లింగ్, వినియోగించే వారిపై పోలీసు నిఘా పెంచామన్నారు. దీనివలన జిల్లాలో గంజాయి వినియోగం తగ్గిందని చెప్పారు. అయితే, గంజాయి వ్యసనపరులు ఆ సరకు దొరకకపోతే సింథటిక్ డ్రగ్స్ ఉపయోగించే ప్రమాదం ఉంటుందని, దీనిపై జిల్లాలోని మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు నిఘా ఉంచాలని కోరారు. కచ్చితమైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే వాహనాల ద్వారా గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసుల తనిఖీల్లో నిర్ధారణ అయ్యిందన్నారు. ఈ వాహనాల్లో విస్తృత తనిఖీలు చేయాలని రవాణా అధికారులను కోరారు. జిల్లాలో డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటర్‌కు ఆమోదం లభించిందని, వారం రోజుల్లో ప్రారంభిస్తామని ఎస్పీ శ్రీధర్ తెలిపారు. సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్, జిల్లా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటర్ కేవీ భూపేష్, ఐబీడీ ఎస్పీ ఎస్.కనకరాజు, ఐసీడీఎస్ పీడీ జీవీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతో అందరికీ రక్షణ

ఐఎల్ఏ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ చింతల



సదస్సులో పాల్గొన్న న్యాయవాదులతో ఐఎల్ఏ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ చింతల

అమలాపురం రూరల్: భారత రాజ్యాంగం అందరికీ రక్షణ కల్పిస్తోందని, దాన్ని పరిరక్షించే బాధ్యత న్యాయవాదులపై ఉందని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఏ) వ్యవస్థాపకుడు శ్రీకాంత్ చింతల అన్నారు. అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఏ) ఉభయగోదావరి జిల్లాలు, ఉత్తర కోస్తా జిల్లాల ప్రాంతీయ సదస్సు శనివారం రాత్రి జరిగింది. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రాష్ట్రంలో చనిపోయిన న్యాయవాదులకు ఏపీ బార్ అసోసియేషన్ రూ.4 లక్షలు సాయం ఇవ్వడానికి ముందుకొచ్చిందన్నారు. ప్రభుత్వం మాచింగ్ గ్రాంటు కింద రూ.10 లక్షలు వెల్ఫేర్ ఫండు ఇవ్వాలని కోరారు. జ్యుడిషియల్ అకాడమీ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.జేసురత్నంకుమార్ మాట్లాడుతూ కోర్టులో ఎలక్ట్రానిక్ సాక్ష్యం, ఎలక్ట్రానిక్ రికార్డుల ఆమోదయోగ్యత అంశంపై అవగాహన కల్పించారు. సదస్సులో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంత కుమార్, ఐఎల్ఏ కోనసీమ జిల్లా కన్వీనర్లు కోట రామ్మోహనరావు, పినిపే రాధాకృష్ణ, సీనియర్ న్యాయవాది డీబీలోక్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తదితరులు పాల్గొన్నారు.

జీజీఎంపీ నిధులతో గ్రామాలాభివృద్ధి


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ని అందిస్తున్న పినిపే శ్రీకాంత్

- మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్
- డి.రావులపాలెంలో గడప గడపకూ..

అల్లవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి మంజూరుచేస్తున్న రూ.20 లక్షల జీజీఎంపీ నిధులతో గ్రామాలను అభివృద్ధిపరుస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని డి.రావులపాలెంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యులు జున్నూరి రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు.

విగ్రహాన్ని బయట పడేయడంపై ఫిర్యాదు

యానాం: ప్రాచీన చరిత్ర ఉన్న యానాంలోని శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి పాత ఆలయంలో ఉండే రామానుజాచార్యుల విగ్రహాన్ని చెత్తలో పడేయడంపై శనివారం పలువురు భక్తులు ఆర్ఏఓ మునిస్వామికి శనివారం ఫిర్యాదు చేశారు. సుమారు 600 ఏళ్ల చరిత్ర కలిగిన వెంకన్న ఆలయాన్ని పునర్నిర్మించేందుకు పాత ఆలయాన్ని కూల్చివేశారు. ఈ నేపథ్యంలో పాత ఆలయంలో ఉండే పలు విగ్రహాలను బాలాలయంలోకి తరలించారు. అయితే విశిష్టాద్వైత సిద్ధాంతకర్త రామానుజాచార్యుల విగ్రహాన్ని ఇటీవలి వేసిన షెడ్డులో ఉంచారని, ఆలయ ఆవరణలో చెత్తను ఊడ్చే క్రమంలో రామానుజాచార్యుల విగ్రహం సైతం దాంట్లో కలిసిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఘటనపై ఫిర్యాదుతో ఆర్ఏఓ మునిస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే ఈ విగ్రహానికి ఎప్పుడూ పూజలు నిర్వహించమని, ఎవరో చాలా ఏళ్ల క్రితం తెచ్చి పెట్టారని అర్చకులు ఆయనకు తెలిపారు.

నూతన కార్యవర్గం ఏర్పాటుకు నిర్ణయం


యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద వీసీకే పార్టీ నేతలు

యానాం: నియోజకవర్గంలో దళిత రాజకీయ పార్టీ విడుతలై చిరుతైగల్ కచ్చ(వీసీకే) పార్టీని పటిష్టం చేయడానికి నూతన కార్యవర్గం ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దేవపోజిలాన్ పేర్కొన్నారు. శనివారం యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు తిరుమవలవన్ ఆధ్వర్యంలో పార్టీని విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక అంబేడ్కర్‌నగర్‌లోని బుద్ధాపార్క్‌లో వీసీకే పార్టీ సమావేశాన్ని నిర్వహించి తాత్కాలిక కమిటీని వేశారు. కార్యక్రమంలో తలయారి, అర్మితమిహాన్, కార్మెగల్, మారన్, విశ్రాంత ఆర్ఏఓ నామాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల పరామర్శ


సత్యనారాయణరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రుపాలేనికి చెందిన సీనియర్ నాయకుడు గాదిరాజు సత్యనారాయణరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సత్యనారాయణరాజు కుటుంబ సభ్యులను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిలు శనివారం పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, పెన్మత్స చిట్టిరాజు, సూరిబాబురాజు, పి.బాబ్జిరాజు, పెన్మత్స వాసురాజు, పి.పెదబాబు తదితరులున్నారు.

పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో చరిత్ర టూరిజం విభాగం ఆధ్వర్యంలో 'పురాతన నాణేలు, కరెన్సీ ఎగ్జిబిషన్‌'ని శనివారం ఏర్పాటు చేశారు. వృత్తి రీత్యా గ్రేడ్ వన్ హిందీ పండిట్ అయిన తాడి వినోద్ సేకరించిన అపురూపమైన పురాతన నాణేలను కరెన్సీ నోట్లను ఇందులో ప్రదర్శించారు. సుమారు 200 దేశాల నాణేలను సేకరించి ప్రదర్శించారు. ఈ నాణేల ప్రదర్శనను దాదాపు 800 మంది వీక్షించారు. ఈ ప్రదర్శన నేటి తరానికి ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ సతీష్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాత్విక్ జోడీ విజయంపై హర్షం

కొత్తపేట: ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో మొట్టమొదటిసారిగా బంగారు పతకం సాధించిన కోనసీమ యువకుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ జోడీ విజయంపై స్థానిక పూర్వ క్రీడాకారులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. సాత్విక్, చిరాగ్ జంట కొరియా జోడీపై గెలిచి భారత కీర్తిపతాకాన్ని ఎగురవేశారని పూర్వ క్రీడాకారుడు, కళాసాహితీ సభ్యుడు షేక్ గౌస్ అన్నారు. సాత్విక్ తండ్రి, కాశీ స్వగ్రామం కొత్తపేట మండలం వాడపాలెం. తల్లి ఇందిరది కొత్తపేట. ప్రస్తుతం వారు అమలాపురంలో స్థిరపడ్డారు.